తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శుక్రవారం
18 సెప్టెంబర్ 2026

## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

- **జాతీయ జెండా ఎగురవేసిన మంత్రి జూపల్లి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలోకి అడుగుపెట్టిన చారిత్రక రోజని అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా, పారదర్శక పాలనతో పాటు అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.









జిల్లాలో సంక్షేమ పథకాల అమలు, ప్రగతిని మంత్రి వివరించారు. మహాలక్ష్మి పథకం కింద 3.81 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకోగా రూ.185.60 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. రూ.500కే గ్యాస్ పథకం ద్వారా 1,27,056 మందికి 4.13 లక్షల సిలిండర్లు అందించి రూ.11.35 కోట్ల సబ్సిడీ కల్పించినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 1,37,046 జీరో బిల్లులు జారీ చేసి రూ.107.77 కోట్ల సబ్సిడీ అందించామన్నారు.

ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచగా 50,314 మందికి రూ.145.79 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 10,232 ఇళ్లు మంజూరు కాగా 9,208 ఇళ్ల పనులు ప్రారంభమైనట్లు వివరించారు. వేడుకల్లో పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి, మేయర్ జి.మమత, ఒబెదుల్లా కొత్వాల్, అదనపు కలెక్టర్లు పి.మధుసూదన్ నాయక్, జె.ఎల్.బి.హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

### కన్నీరు పెట్టిస్తున్న

## టమాటా ధరలు.. గొర్రెలకు మేతగా పంట!



**కేటి దొడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఆరుగాలం కష్టపడినా దక్కని గిట్టుబాటు ధరమార్కెట్‌కు తెస్తే రవాణా ఖర్చులు కూడా రావట్లేదని ఆవేదనప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఆదుకోవాలని రైతుల డిమాం డ్కేటీదొడ్డి: రెక్కలు ముక్కలు చేసుకుని, ఆరు గాలం శ్రమించి పండించిన పంటకు కనీస మద్దతు ధర లభించకపోవడంతో అన్నదాత లు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేటీదొడ్డి మార్కెట్‌లో టమాటా ధరలు పాతాళానికి పడిపోవడంతో స్థానిక రైతులు కోత కోసిన పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు కూడా సాహసించడం లేదు. మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించినా.. కనీసం రవాణా ఖర్చులు, పెట్టిన పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో, చేసేదేమీ లేక టమాటా పంటను నేలపాలు చేస్తున్నారు. కొందరు రైతులు ఏకంగా చేతికందిన టమాటాలను గొర్రెలకు మేతగా వేస్తూ తమ నిస్సహాయతను చాటుకుంటున్నారు.పెట్టుబడులు కూడా రాని పరిస్థితి:విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు మరియు కూలీల కోసం వేలాది రూపాయలు అప్పులు చేసి పంటను సాగు చేశామని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు దారుణంగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. సాగుకు చేసిన ఖర్చులో సగం కూడా తిరిగి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.'వ్యవసాయం దండగ' అనే పరిస్థితి రావడానికి కారణం ఇదేనా?పంటల సాగు, దిగుబడి మరియు మార్కెటింగ్ అంశాలపై ప్రభుత్వాలు సరైన ప్రణాళికలు రచించకపోవడం వల్లే ఏటా రైతాంగం ఇలాంటి దుస్థితిని ఎదుర్కొంటోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను నియంత్రించడంలో, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు విఫలమవు తున్నారని, దీనివల్ల "వ్యవసాయం దండగ" అనే పరిస్థితి క్షేత్రస్థాయిలో నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించాలి:కేటీదొడ్డి పరిసర ప్రాంతాల్లోని టమాటా రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ జోక్యం చేసుకొని మద్దతు ధర కల్పించాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి అండగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో వ్యవసాయానికి పూర్తిగా దూరమవ్వాల్సి వస్తుందని రైతులు హెచ్చరిస్తున్నారు.

## నిమజ్జనంలో అప్రమత్తత తప్పనిసరి

- **కృష్ణానది తీరంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సునిత రెడ్డి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,అధికారులను ఆదేశించారు. పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ కృష్ణానది తీరంలో బ్రిడ్జి వద్ద నిమజ్జనానికి గుర్తించిన ప్రాంతాన్ని గురువారం ఆమె పరిశీలించారు. కృష్ణానదిలో నీటిమట్టం తక్కువగా ఉన్న నేపథ్యంలో విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలు, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన సమయంలో ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా భక్తులు, నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.ఎస్పీ వెంట డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ ఓ.డి. రమేష్, పెబ్బేరు ఎస్సై వెంకటేష్‌గౌడ్, శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## పాఠశాలలో బిర్యానీ కలకలం..

- **పాఠశాలలో బిర్యానీ కలకలం..**
- **31 మంది విద్యార్థులకు అస్వస్థత**
- **కోలుకుంటున్నా చికిత్స పొందుతున్న విద్యార్థులు**





**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోడి(లోని కలాన్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిర్యానీ తిన్న 31 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన గురువారం కలకలం రేపింది. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశం అస్వస్థతకు గురైనట్లు సమాచారం.

*మిగతా 12లో..*

## సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజారంజక పాలన







**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఐడీఓసీ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జోగుళాంబ గద్వాల జిల్లా అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందని తెలిపారు.

జిల్లాలో ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో 3.36 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందగా, రూ.129.03 కోట్ల ప్రయోజనం చేకూరిందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి 18,431 మందికి రూ.53.29 కోట్ల వైద్యసేవలు అందించామని తెలిపారు. 58,113 మంది రైతులకు రూ.513.99 కోట్ల పంట రుణమాఫీ చేశామని, రైతుభరోసా కింద 1,72,417 మంది రైతులకు రూ.263 కోట్లు జమ చేశామని పేర్కొన్నారు. 75 కొనుగోలు కేంద్రాల ద్వారా 50,725 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.121.18 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

జిల్లాలో 6,795 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 649 పూర్తయ్యాయని, 5,146 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రూ.500కే గ్యాస్ పథకం ద్వారా 95,754 మందికి రూ.19.98 కోట్ల సబ్సిడీ, గృహజ్యోతి కింద 88,766 కుటుంబాలకు రూ.57.08 కోట్ల విద్యుత్ సబ్సిడీ అందించామన్నారు. చేయూత పింఛన్ల ద్వారా 66,548 మందికి నెలకు రూ.16.23 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రూ.92.88 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు.

**అభివృద్ధి పనులకు ప్రాధాన్యం...**

గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.19 నుంచి 15 టీఎంసీలకు పెంచేందుకు రూ.165 కోట్లు, గట్టు ఎత్తిపోతల పథకాన్ని 3 టీఎంసీలకు పెంచేందుకు రూ.1,781 కోట్లతో రీ-డిజైన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. హామ్ రోడ్లకు రూ.339.39 కోట్లు, గద్వాల మెడికల్ కళాశాల భవనాలు, వసతిగృహాలకు రూ.128 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నర్సింగ్ కళాశాల, క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధిలో భాగంగా 120 మంది విద్యా వలంటీర్లను నియమించామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు రెండు నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, సరిత, గట్టు తిమ్మప్ప, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారులు సేవాభావంతో పనిచేయాలి

- పోలీస్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం
- జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్



సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17(జనంసాక్షి): ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తొలి రోజున ప్రజలకు సేవ చేయాలనే ఉత్సాహంతో విధుల్లో చేరినట్లే, చివరి వరకు అదే సేవాభావంతో పనిచేయాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ పారితోష్ పంకజ్ సూచించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించు కుని సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ ఈ దినోత్సవాన్ని నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, సమానత్వం, న్యాయం, సేవాభావం వంటి విలువలను ప్రజాపాలన దినోత్సవం గుర్తు



చేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీ సత్యయ్యగౌడ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగ రాజు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.రమేష్, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు, రామకృష్ణారెడ్డి, రాముానాయుడు, నగేష్, ఆర్‌ఐలు సురేష్‌నాయక్, రాజశేఖర్‌రెడ్డి, దానియేల్‌తో పాటు ఎస్‌బీ, డీసీఆర్‌బీ ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏడుగురు విద్యార్థులు ఎంపిక



నంగునూర్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): గట్ల మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ చాటారు. ఈ నెల 8న సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బి. అర్చన, బి. దీపిక, బి. అర్పిత, బి. ఐశ్వర్య, బి. హర్షిత, ఎం. లాస్య, ఎస్. నందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు 18, 19, 20 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జరగనున్నట్లు ప్రధా నోపాధ్యాయుడు ఎం. రమేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మన్ గాండ్ల తిరుమల, సర్పంచ్ ఇంగ నరేష్, ఉపసర్పంచ్ తిప్పని శ్రీనివాస్ అభినందించారు. వ్యాయామ ఉపా ధ్యాయుడు డి. రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కరెంట్ కష్టాల్లో వ్యవసాయం..

- సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా





పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 17 (జనం సాక్షి): వ్యవసాయానికి విద్యుత్ కోతలు తీవ్రంకావడంతో పెద్ద శంకరంపేట మండ లంలో రైతులు ఆందోళనకు దిగారు. గురు వారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా, రోడ్డుదిగ్బంధనం నిర్వహించి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వరి, పత్తి తదితర పంటలకు నీరు అవసరమైన సమయంలో ముందస్తు సమా చారం లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో తెలియక పొలాల వద్దే జాగారం చేయాల్సి వస్తోందన్నారు. తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు, స్టార్టర్లు కాలిపోయి నష్టపోతున్నామని తెలిపారు. రైతులకు మద్దతుగా ధర్నా ప్రాంతానికి చేరు కున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లా డుతూ.. ఎన్నికల సమయంలో 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం 8 నుంచి 10 గంటల విద్యుత్ కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను పునరుద్ధ రించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ అధికారి శ్యాంసుందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీని వాస్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్య క్షుడు సురేష్‌గౌడ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు..



పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 17(జనంసాక్షి): పెద్ద శంకరంపేట స్వర్ణకార సంఘ భవనంలో స్వర్ణకార సంఘం ఆధ్వ ర్యంలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సం ఘం బాధ్యులు బాయి కాడి నర్సింలు, లక్ష్మణ్, సంతోష్ కుమార్. శ్రీకాంత్ నరసింహ చారి. రామాచారి సంతోష్ మహేష్ శ్రీనివాస్. స్వర్ణకార సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి గిరిజనుల పాలాభిషేకం



హత్నూర, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): మండలంలోని తెల్లరాళ్ల తండా గ్రామ పంచాయితీ గిరిజనులు గురువారం మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు రవీందర్ నాయక్ మాట్లాడుతూ తండాల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గిరిజనులు స్వయం పాలన దిశగా ముందుకు సాగేందుకు తండాలకు గ్రామ పంచాయతీ హోదా కల్పించారని తెలిపారు. పోడు భూములకు పట్టాలు, రిజర్వేషన్ల పెంపు వంటి నిర్ణయాలు గిరిజనులకు ప్రయో జనం చేకూర్చాయని పేర్కొన్నారు. గిరిజనుల సమగ్రాభి వృద్ధికి తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతగా పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోతుల బెడద నివారణకు వినూత్న ప్రయోగం



శివ్వంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): శివ్వంపేట గ్రామంలో కోతుల బెడద నివారణకు మాజీ జడ్పీటీసీ పబ్బా మహేశ్ గుప్తా వినూత్న చర్యలు చేపట్టారు. కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు, వస్తువులు ఎత్తుకెళ్లడంతో పాటు పంటలు, కూరగాయ తోటలను ధ్వంసం చేస్తున్నాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మహేశ్ గుప్తా సొంత నిధులతో కోతులను పట్టుకునే వారిని రప్పించి ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేయించారు. ఉదయం, సాయంత్రం కోతుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బోన్ల ద్వారా వాటిని పట్టుకునే చర్యలు చేపట్టారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజపేట వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ మల్లేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలి



శివ్వంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై, ఆయన రచించిన భారత రాజ్యాంగం పైన హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, మండల పరిధిలోని దొంతి గ్రామంలో గురువారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్ పై వెంటనే కఠిన చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వారు మండల కేంద్రమైన శివంపేటలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు జీవితంలో మళ్ళీ ఎవ్వరూ చేయకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాద్ లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నీరుడి సుకుమార్, ఉపాధ్యక్షులు అంబిగారి నర్సింలు, బ్యాగరి రాములు నీరుడి మురళీకృష్ణ, నీరుడు స్వామి, కోదాస్ స్వామి తుడుము రాములు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ



రాజాపూర్, సెప్టెంబర్ 17(జనంసాక్షి): మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో తెలం గాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ పతాకా విష్కరణ చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాధాకృష్ణ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయిబ్ తహసీల్దార్ భారతి, ఆర్ఐ మంజుల, సర్పంచ్ రామాకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్, ఆనంద్, నజీమ్, విక్రమ్ రెడ్డి, యాదయ్య , గోవర్దన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆశీర్వాద దీపాలతో మోదీ జన్మదిన వేడుకలు


తెలకపల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలకపల్లి మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ఆశీర్వాద దీపం కార్యక్రమం నిర్వహించారు. బాణాసంచా కాల్చి, ప్రజలకు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ మోదీ 25 ఏళ్లుగా దేశ ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్నారని అన్నారు. ఆయన మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని, దేశ సేవకు మరింత అవకాశం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈర్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, రాజు, బాబు సాగర్, నరేంద్రచారి, గుంటూరు రాముడు, మధుగౌడ్, శివ, లక్ష్మణ్, రమేష్, రుక్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెరియార్ 147వ జయంతి వేడుకలు



మక్తల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): మక్తల్ పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబే ద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దక్షి ణాసియా సోక్రటీస్, ప్రముఖ హేతువాద ఉద్యమకారుడు పెరియార్ రామసామి 147వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మూఢనమ్మకాల వల్ల 90 శాతం ప్రజలు దోపిడీకి గురవుతున్నారని, సైన్సును కాపాడుతూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవడమే పెరియార్ కు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు పోలప్ప, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, పాల్గొన్నారు.

## నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



నవాబుపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ సిబ్బంది మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి

**• సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశ సమైక్యతను, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ప్రత్యేకత అని, కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.
తెలంగాణ సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవం, సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి , విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మాజీ జేపీటీసీ కొండల్ రెడ్డి, మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, చక్రపాణి, రామప్ప, కౌన్సిలర్‌లు సర్పంచ్‌లు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల కృతజ్ఞత.. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**కల్హేర్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలకు కృతజ్ఞతగా కల్హేర్ మండలం ఖానాపూర్ (కె) తండా వాసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి తమ అభిమానాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేశారు.
**గిరిజన నాయకులు మాట్లాడుతూ..** తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచే నిర్ణయం తీసుకుందని తెలిపారు. తండాల్లో సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. గతంలో గ్రామాలకు దూరంగా ఉన్న అనేక గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించారని గుర్తుచేశారు. తండాలకు పంచాయతీ హోదా రావడంతో స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అనంతరం నిర్వహించిన కృతజ్ఞత సభలో గిరిజన సంక్షేమం, విద్య, మౌలిక వసతులు, స్థానిక పాలన తదితర రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, శివరామ్ నాయక్, గుర్యా నాయక్, గోపాల్ మారుతి నాయక్, ప్రశాంత్, సాగర్, బిల్యా నాయక్, రూప్‌సింగ్, తుకారాం మహారాజ్, పరుశురామ్ రాథోడ్, కిరణ్, రవి నాయక్, గోపాల్ నాయక్, నార్యా నాయక్, నర్వ రవీందర్, అంబేంద్ దత్తు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ చేతివృత్తులకు ఆద్యుడు

**• శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ చేతివృత్తులకు ఆద్యుడని శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూల మాల వేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ చేతివృత్తులకు ఆద్యుడని చెప్పారు. హిందూ పురాణాల ప్రకారం ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో సృష్టి కర్తగా విశ్వకర్మను పరిగణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

# మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 17(జనంసాక్షి):** ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.
ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన ప్రజాపాలన అని అన్నారు.
ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ మున్సిపల్ ఛైర్పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,టౌన్ అధ్యక్షుడు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# చందనకు అభినందనలు.. శ్రీనివాసులుకు పరామర్శ

**• మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**





**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఖిల్లా ఘనపూర్ మాజీ ఎంపీటీసీ వాణి వెంకటయ్య కుమార్తె కె.చందన ఎంబీబీఎస్ సీటు సాధించడంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వనపర్తి 24వ వార్డు పీర్లగుట్టకు చెందిన పోస్ట్‌ఆఫీస్ శ్రీనివాసులు కాలికి ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కిష్టగిరికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అంజి సోదరుడు డ్రైవర్ వెంకయ్య కొత్త ట్రాక్టర్‌ను పూజ చేసి, స్వయంగా నడిపి ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, పలుస రమేష్‌గౌడ్, వాకిటి శ్రీధర్, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# నాగర్‌కర్నూల్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి



**నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణపతి, నవగ్రహ పూజలు, రుద్రాభిషేకం, శ్రీ విశ్వకర్మ మహాయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మహాయజ్ఞంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్‌రెడ్డి పాల్గొనగా విశ్వబ్రాహ్మణులు శాలువాతో సన్మానించారు. అనంతరం శ్రీ విరాట విశ్వకర్మ భగవాన్ విగ్రహాన్ని పట్టణ వీధుల్లో సాంప్రదాయబద్ధంగా ఊరేగించారు. కోలాటాలు, భజనలు, సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. బులియన్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురేంద్ర, కౌన్సిలర్ మమ్మద్ నిజాం, ఆలయ అభివృద్ధి కమిటీ, స్వర్ణకార, కార్పెంటర్స్ సంఘాల ప్రతినిధులు, విశ్వబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**• నృత్యాలు, సంగీతం, కళా ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు**





**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** పాలమూరు జర్నలిస్ట్ కాలనీలో వైష్ణవి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు, విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు, సంగీతం, వివిధ సాంస్కృతిక అంశాలను ప్రతిబింబించే కళా ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుకున్నారు. నృత్యాలు, హావభావాలు, సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రదర్శనలను తల్లిదండ్రులు, కాలనీ వాసులు, ప్రేక్షకులు చప్పట్లతో అభినందించారు. జిల్లా ఎస్పీ జానకి కూడా నృత్య ప్రదర్శనలను తిలకించారు. అనంతరం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
అకాడమీ ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, వేదికపై ప్రదర్శన నైపుణ్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. నృత్యం, సంగీతం తదితర కళారూపాల్లో శిక్షణ అందిస్తూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, శిక్షకులు, అకాడమీ నిర్వాహకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న కార్యకర్తకు అండగా నిలిచిన యంగ్ డైనమిక్ లీడర్

### భువన చెంద్రను పరామర్శించిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మెదక్ టౌన్ సోషల్ మీడియా కన్వీనర్ భువన చెంద్ర ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న యంగ్ డైనమిక్ లీడర్, మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు "ధైర్యంగా ఉండండి... అండగా నేనున్నాను, నేను చూసుకుం టాను" అంటూ భువన చెంద్రకు ధైర్యం చెప్పారు. కార్యకర్తకు కష్ట సమయంలో అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ , మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ , కౌన్సిలర్ అస్తర్‌గల్ల బాలరాజ్ , చాదల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి






**నారాయణఖేడ్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):**
భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వీ. తుకారం నాయక్ అన్నారు. సెప్టెంబర్ 17న నారాయణఖేడ్ డివిజన్‌లో వార్షికోత్సవ ముగింపు సభ టి. కుమార్ అధ్యక్షతన జరిగింది. తుకారం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తుకారం నాయక్ మాట్లాడుతూ 1946 సెప్టెంబర్ 11 నుంచి 1951 అక్టోబర్ 21 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కొనసాగిందన్నారు. నైజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి, సామాన్యులను పోరాటంలో భాగస్వాములను చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనని పేర్కొన్నారు. ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చిందన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య, భీంరెడ్డి నరసింహారెడ్డి, మద్దికాయల ఓంకార్, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలమ్మ, జాత్రోత్ తను నాయక్ తదితరులు ప్రజలను చైతన్యపరిచి పోరాటాన్ని ముందుకు నడిపించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, దత్తు, బలిసి నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి);**
తెలంగాణ ప్రజా పాలన దినోత్సవశీను పురాష్కరించుకొని గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాస రావు జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...** పోలీసు అధికారులకు, సిబ్బందికి, జిల్లా ప్రజలందరికి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ,1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలోనే కొనసాగిందని, అనంతరం కేంద్ర హోమ్‌మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో విజయవంతమైన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రేడియో ప్రసంగంలో హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం అయినట్లు ప్రకటించారని గుర్తు చేశారు. అందుకే ఈ రోజును తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు.

ప్రజా పాలన యొక్క ప్రాముఖ్యత, పారదర్శక పరిపాలన ద్వారా ప్రజలకు అందే లాభాలను వివరించారు. అలాగే ప్రజల భద్రత, శాంతి భద్రతా పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె శంకర్, కార్యాలయ ఏవో సాయికృష్ణ, డి.ఎస్పీ వై. మొగిలయ్య, సాయుధ దళ డి.ఎస్పీ నరేందర్ రావు,గద్వాల,సీఐ శ్రీను, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ టాటా బాబు,ఆర్.ఐ లు వెంకటేష్, నరేష్, హరీఫ్,జిల్లా లోని అన్ని వింగ్స్ ఎస్సైలు, ఎస్బి, డీసీ అర్బీ, ఐటీ, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది మరియు కార్యాలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హవేలీ ఘనపూర్‌లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



**హవేలీ ఘనపూర్ మండలం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వడులపర్తి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రాచరిక పాలన, రజాకార్ల అణచివేత నుంచి తెలంగాణ విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ నిర్మాణంలో శ్రామికులు, చేతివృత్తిదారుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, ప్రభు, ప్రభాకర్, సత్యం, కార్య నాయక్, సురేందర్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ నిమజ్జన స్థలంలో ఏర్పాట్ల పరిశీలన

### భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: ఆర్డీఓ రమాదేవి



**రామాయంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని సర్వాయి కుంట వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని మెదక్ ఆర్డీవో రామాదేవి గురువారం పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేశ్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

నిమజ్జన ప్రాంతంలో బారికేడింగ్, బుష్ కటింగ్, విద్యుత్ సౌకర్యం వంటి ఏర్పాట్లను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జన సమయంలో ప్రమాదాలు చోటు సుకోకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ ఏర్పాట్లను సంబంధిత ఏఈ సమన్వయంతో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో తూప్రాన్ డీఎస్పీ, రామాయంపేట మున్సిపల్ కమిషనర్, రామాయంపేట ఎస్‌హెచ్ఓ తదితరులు పాల్గొని నిమజ్జన ప్రాంతంలోని పరిస్థితులను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో భూ పోరాటాలు

- **సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు**




**చేర్యాల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో భూమిలేని పేదల కోసం భూ పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. వీరబైరాన్‌పల్లిలో జరిగే అమరవీరుల సంస్మరణ సభకు హాజరయ్యేందుకు వెళ్తూ చేర్యాల గాంధీ సెంటర్ నుంచి వీరబైరాన్‌పల్లి వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేదలను ఆత్మగౌరవంతో నిలబెట్టిందన్నారు. నిజాం పాలన రద్దు, దున్నేవారికి భూమి, భూమిపై రైతుల హక్కులు, వెట్టిచాకిరీ నిర్మూలన, మాతృభాషలో విద్య వంటి డిమాండ్లతో పోరాటం సాగిందన్నారు. వేలాది మంది కమ్యూనిస్టు యోధుల త్యాగాలతో లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ అయిందని, అనేక గ్రామాల్లో ప్రజా పాలన ఏర్పడిందని తెలిపారు.

చరిత్రాత్మక రైతాంగ పోరాటాన్ని మతాల మధ్య పోరాటంగా చిత్రీకరించే రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాఘవులు అన్నారు. భూమిలేని పేదలను సమీకరించి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూ పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ర్యాలీలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు, జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, జిల్లా నాయకులు, మండల, పట్టణ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తికి ప్రోత్సాహం

- **పెద్దగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో స్పోర్ట్స్ టీ-షర్టుల పంపిణీ**
- **విద్యతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్న శివసేన రెడ్డి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్17 (జనంసాక్షి):**
విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు వనపర్తి డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి స్పోర్ట్స్ టీ-షర్టులను పంపిణీ చేశారు. వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు టీ-షర్టులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, సర్పంచ్ పుష్పలత శివకుమార్, వనపర్తి డీసీసీ వైస్ ప్రెసిడెంట్ తిరుపతయ్య , వనపర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవికిరణ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాములు, మాజీ సర్పంచ్ జానకి కొండన్న, రమేష్, శేఖర్‌రెడ్డి, బుచ్చిబాబు, బాలరాజ్, డైరెక్టర్ శారద, విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు గ్రామ నాయకులు, గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రామాయంపేటలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**రామాయంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ సాధనలో తొలి దశ నుంచి మలిదశ ఉద్యమం వరకు అమరుల త్యాగాలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సూచనల మేరకు గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

చైర్మన్ జాతీయ జెండాను ఆవిష్కరించి అమరులకు నివాళులర్పించారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు.

అమరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ కృషి కీలకమని తెలిపారు.

కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## బాదుగుల చెరువు అభివృద్ధికి రూ.2.40 కోట్ల నిధులు

**కోహెడ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని బాదుగుల చెరువు అభివృద్ధికి పర్యాటక శాఖ ద్వారా రూ.2.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని మాజీ సర్పంచ్ గోరిట్యాల లక్ష్మణ్ తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కోహెడ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. చెరువు వద్ద అభివృద్ధి పనులతో పాటు పార్కు నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు నిధులు వినియోగించనున్నట్లు లక్ష్మణ్ తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## విద్యార్థుల మృతి పట్ల ప్రగాఢ సంతాపం



**హత్నూర, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** శిరీషా ట్రస్ట్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు వినాయక నిమజ్జనం లో ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విద్యార్థులు హత్నూర మండలంలోని తుర్కల ఖానాపూర్ గ్రామ పరిధిలో గల రత్నపురి ఇన్స్ టీట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల మృతి పట్ల కళాశాల యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. కళాశాల ప్రాంగణంలో గురువారం అధ్యాపక బృందం, సిబ్బంది,విద్యార్థులు వారి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## పోటా పోటీగా పోరాడి.. విజేతలుగా నిలిచి



**పాపన్నపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** పాపన్నపేట జడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు మండల స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 14,అండర్ 17 బాలికలు, బాలురలకు క్రీడా పోటీలు సందడిగా సాగాయి. మొదటి రోజు కబడ్డీ,రెండవ రోజు వాలీబాల్,మూడవ రోజు ఖోఖో పోటీలు జరిగాయి. పోటా పోటీగా సాగిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రతాపరెడ్డి,ఉపాధ్యాయులు రమేష్,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, బీజేవైఎం అధ్యక్షుడు బుగుదాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, నాయకులు బోలా శంకర్, అనిల్ భూషణం, నర్సింలు, అంజయ్య, వెంకయ్య, అరె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగూర్ కాలువ, పెద్దరెడ్డిపేట్ పనులు వేగవంతం చేయాలి

- **రైతులకు సాగునీరు.. ప్రజలకు తాగునీరు అందేలా ముందస్తు చర్యలు**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జిల్లాలో నీటిపారుదల పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సంబంధిత శాఖల అధికారులతో సాగు, తాగునీరు, నీటి నిల్వలు, ఆనకట్టల భద్రత, వసతి గృహాల మౌలిక వసతులపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

సింగూర్ కాలువ, పెద్దరెడ్డిపేట్ ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. పంటలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని నీటి నిల్వల వివరాలను ప్రతి వారం నివేదిక రూపంలో సమర్పించాలని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

ఆనకట్టలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి భద్రతపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. పనులకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనావేసి పరిష్కార చర్యలు చేపట్టాలని, విద్యుత్ కొరత లేకుండా శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సాగు, తాగునీరు, నీటి నిల్వలు, పనుల పురోగతిపై శాఖల వారీగా నివేదికలు సమర్పించాలని తెలిపారు.

**బాలికల వసతిగృహానికి ప్రతిపాదనలు...**

అందోల్ నియోజకవర్గంలో పోస్ట్‌మెట్రిక్ కళాశాల బాలికల వసతిగృహం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని వసతిగృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అదనపు సౌకర్యాలు, వసతిగృహాల పరిస్థితిపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, నీటిపారుదల శాఖ అధికారులు విద్యావతి, జైభీమ్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుని ఆశీస్సులతో రైతన్నలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

- **బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు**



**కొల్చారం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని వాసురామ్ తండా, అంసాన్‌పల్లి, వెంకటాపూర్, నాయిని జలాల్ పూర్ గ్రామాల్లో గణేష్ మండపాలకు బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు ఆధ్వర్యంలో విరాళాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పాడిపంటలతో రైతన్నలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మండపాల నిర్వాహకులు సంతోష్‌రావును శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, వాసురామ్ తండా సర్పంచ్ వినోద్‌నాయక్, ఉపసర్పంచ్ ఆరె రవీందర్, మహేష్, శ్యాంరావు, సురేష్‌గౌడ్, సోమ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

- **చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎస్సైలకు ఫిర్యాదు**



**నంగునూరు, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నంగునూరు మండల కేంద్రంలో దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విద్యాసంస్థల బంద్ నిర్వహించి, హమారా ప్రసాద్ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. అనంతరం తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు సమర్పించి, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్‌పై వివాదాస్పద పుస్తకాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

మహనాయకులపై అసత్య ప్రచారాలను నిలిపివేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, సర్పంచులు బాల పోచయ్య, సాయిలు, నాయకులు బాలరాజు, రాజేందర్, రాజమౌళి, నర్సింహారావు, బదే రాజయ్య, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

- **చేర్యాల ఎంపీడీవో అణభేరి ప్రణయ్**





**చేర్యాల, సెప్టెంబర్ 17(జనంసాక్షి):** మండలంలోని ముస్యాల రైతు వేదికలో చేర్యాల ఎంపీడీవో అణభేరి ప్రణయ్ అధ్యర్యంలో గురువారం చేర్యాల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై సమీక్ష, గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. అభివృద్ధి పనుల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## రంగంపేట సహకార సంఘానికి రూ.4 కోట్లతో గోదాం

- **5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ సామర్థ్యం**



**కొల్చారం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** రంగంపేట సహకార సంఘానికి 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ సామర్థ్యం తో గోదాం నిర్మాణానికి నాబార్డ్ ద్వారా రూ.4 కోట్లు మంజూరైనట్లు సంఘం చైర్మన్, డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు అరిగే రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘానికి ఉన్న ఐదున్నర ఎకరాల స్థలంలో గోదాం నిర్మాణానికి గతంలో నాబార్డుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మంజూరు ఉత్తర్వులు అందాయని, సంఘం వాటాగా రూ.40 లక్షలు చెల్లించగా మిగిలిన నిధులను నాబార్డ్ సమకూర్చనుందని తెలిపారు. ఇందులో 33 శాతం సబ్సిడీగా రానున్నట్లు వెల్లడించారు. గోదాం నిర్మాణంతో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం కలిగి ప్రయోజనం పొందుతారని, త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, దుర్గేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు...



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటతో పాటు ఆయా గ్రామాలలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.

పెద్ద శంకరంపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి అల్లా దుర్గం సిఐ రేణుక రెడ్డి. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి. తాసిల్దార్ నారాయణ. ఎంపీడీవో క్రాంతి కుమార్ ప్రజలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్య సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు..

# క్షయ బాధితులకు ఉచిత పోషకాహార కిట్ల పంపిణీ

- రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- యూనియన్ బ్యాంక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి బాధితులకు పోషక కిట్లు పంపిణీ



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** క్షయ వ్యాధి బాధితులకు పోషకాహారం అందించేందుకు యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని . రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి బాధితులకు కిట్లను స్వయంగా అందజేశారు.

క్షయ వ్యాధిగ్రస్తుల పోషకాహారం కోసం ప్రభుత్వం ఇప్పటికే నెలకు రూ.1,000 ఆర్థిక సహాయం అందిస్తోందని అధికారులు తెలిపారు. దీనికి అదనంగా యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ తమ సామాజిక బాధ్యత నిధుల ద్వారా రూ.25 లక్షల విలువైన పోషకాహార కిట్లను రాష్ట్రవ్యాప్తంగా 700 మంది బాధితులకు నెలకు ఒక కిట్ చొప్పున ఆరు నెలల పాటు అందించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో 2026 ఆగస్టు 31నాటికి 1,527 క్షయ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో 300 మంది బాధితులను ఎంపిక చేసి పోషకాహార కిట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వంతో పాటు సేవా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సహకరించడం అభినందనీయమన్నారు. బాధితులకు అవసరమైన పోషకాహారం అందించడం ద్వారా వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ టి. నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, యూనియన్ బ్యాంక్ రాష్ట్ర మేనేజర్ వి. రాధాకృష్ణన్, రాష్ట్ర సంయుక్త సంచాలకులు (క్షయ) డాక్టర్ రాజేషం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. లలితాదేవి, వైద్య విద్య సంచాలకురాలు డాక్టర్ ఎన్. వాణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ప్రకాష్ రావు, క్షయ నిర్మూలన కార్యక్రమ అధికారి డాక్టర్ సిహెచ్. అరుణకుమారి, వైద్య విద్యార్థులు, క్షయ నిర్మూలన పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి





**కొండపాక, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** వీరబైరాన్‌పల్లి బురుజును పునరుద్ధరించి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. గురువారం వీరబైరాన్‌పల్లిలో జరిగిన తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభకు కొండపాక చౌరస్తా నుంచి బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ 1946-51 మధ్య సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలు భూస్వాములు, జాగీర్దారులు, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు.

వేలాది మంది ప్రాణత్యాగం చేశారని, పెద్ద ఎత్తున భూమి పేదలకు పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న వీరబైరాన్‌పల్లిని పాలకులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

ప్రతి ప్రభుత్వం సెప్టెంబర్ 17న అమరవీరుల సంస్మరణ సభలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. చరిత్రను వక్రీకరించి కుల, మతాల మధ్య విభజన సృష్టించే ప్రయత్నాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బైరాన్‌పల్లి అభివృద్ధికి ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు.


కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు కాముని గోపాలస్వామి, సందబోయిన ఎల్లయ్య, గొడ్డు బాల్ర భాస్కర్, బాల నరసయ్య, దాసరి ప్రశాంత్, జలగం శిరీష తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి



**గుమ్మడిదల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** వినాయక నిమజ్జనాన్ని సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని గుమ్మడిదల తహసీల్దార్ కోరారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్యశాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు గుర్తించిన ప్రదేశాల్లోనే నిమజ్జనం చేయాలని, బారికేడ్లు దాటి నీటిలోకి వెళ్లవద్దన్నారు. పిల్లలను చెరువులు, కుంటల వద్దకు ఒంటరిగా పంపొద్దని సూచించారు. ఈత రాని వారు నీటిలోకి దిగకూడదని, మద్యం సేవించి నిమజ్జనంలో పాల్గొనవద్దన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల సహకారంతో నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని కోరారు.

## హిందీ పండిత్ బదిలీ రద్దు చేయాలి



**హవేలి ఘనపూర్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జక్కన్నపేట ప్రభుత్వ పాఠశాలలో హిందీ పండిత్‌గా పనిచేస్తున్న శీతల్ సింగ్ బదిలీని రద్దు చేసి, పాఠశాలలోనే కొనసాగించాలని గ్రామ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాధికారికి వినతిపత్రాలు అందజేశారు. పాఠశాలలో 8వ తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతోందని, విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఉపాధ్యాయుల అవసరం ఉందన్నారు. శీతల్ సింగ్ బదిలీ అయితే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఆయన స్థానంలో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని నియమించే వరకు బదిలీ నిలిపివేయాలని కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చి, అదనపు ఉపాధ్యాయులను నియమించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



**పుల్కల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండల కేంద్రం పుల్కల్‌లో గురువారం విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అనంతరం జెండా ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ చిరంజీ లావణ్య, మాజీ సర్పంచ్ మఠం సిద్ధన్న, బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి లస్కరి ఆంజనేయులు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ, శిల్ప, చేతివృత్తుల రంగాల్లో విశ్వకర్మల సేవలు కీలకమన్నారు. సంప్రదాయ వృత్తులను పరిరక్షించడంతోపాటు యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు నర్సింలు, నాగప్ప, బసవరాజ్, హరి, కుల పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## గోపాలపేటలో 18, 19న ఎస్‌జీఎఫ్ మండలస్థాయి పోటీలు

**గోపాలపేట, సెప్టెంబర్ 17: (జనంసాక్షి):** గోపాలపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానంలో ఈ నెల 18, 19 తేదీల్లో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్--14, అండర్--17 విభాగాల్లో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించడమే పోటీల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## చరిత్ర పుస్తకాలలో రాయబడని అమరుల కథ





- నేటి తరానికి తెలియజేయాలని డిమాండ్

**కోహెడ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ చరిత్ర పుస్తకాలలో రాయబడని నిజమైన కథ ఇది. నాడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో గుర్తించబడని చరిత్ర, నేటి పాలకులకు కనిపించని చరిత్ర. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, నేటి సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ అడవుల్లో ఉన్న భూషణం గుట్టల్లో నాడు 200మంది సాయుధ రజాకార్ల దాష్టికానికి బలై అసువులు బాసిన అమరుల చరిత్ర ఇది. నాటి హైదరాబాద్ సంస్థానం(నేటి తెలంగాణా) లో జరిగిన మొట్టమొదటి ఎన్కౌంటర్. ఇప్పటికైనా చరిత్రకారులు, రచయితలు, రాజకీయ నాయకులు, పాలకులు స్పందించి ఈ చరిత్రను పుస్తకాలలో చేర్చాలని కోహెడ మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ తూమోజు జగదీశ్వర చారి ఆ అమరుల వారసుడిగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయానికి రూ.18.66 లక్షల హుండీ ఆదాయం



**గుమ్మడిదల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 70 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా సాధారణ హుండీ ద్వారా రూ.18,00,598, అన్నదానం హుండీ ద్వారా రూ.65,980 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు హుండీల ద్వారా మొత్తం రూ.18,66,578 ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. లలితా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపు కార్యక్రమంలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈవో రామ బ్రహ్మచారి, మాజీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు, కౌన్సిలర్ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ వేణు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.

## రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన

**కృష్ణ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** కృష్ణ మండలం గురజాల గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. సత్యనారాయణ రైతులకు వరి సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, సమగ్ర సస్యరక్షణపై సూచనలు చేశారు. పంట కొయ్యలను కాల్చడం వల్ల నేల సారవంతత, సూక్ష్మజీవులకు నష్టం జరుగుతుందని తెలిపారు. పర్యావరణహిత పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు బి.అభిలాష్, రవికుమార్, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

### కులవృత్తుల పరిరక్షణకు ప్రభుత్వం అండగా నిలవాలి



**రామాయంపేట,సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ కులస్తులు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి విశ్వకర్మ భగవానుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ కార్యక్రమంలో కాట్రియాల విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, కులస్తులు పాల్గొన్నారు.

## ఈనెల 27న జాతీయస్థాయి కరాటే పోటీలు

• పోటీల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్ లో ఈనెల 27న నిర్వహించే జాతీయస్థాయి కరాటే పోటీలకు సంబంధించిన బ్రోచర్ ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. మాస్టర్ బోడోకాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు ఈనెల 27న నిర్వహిస్తున్నామని, హాజరు కావాలని నిర్వాహకులు కరాటే మాస్టర్ సయ్యద్ కోరారు.

పోటీలలో ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు వస్తారని, టెస్టులతోపాటు బహుమతుల అందజేత ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

## విశ్వకర్మల అభివృద్ధికి అండగా ఉంటా

• ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** విశ్వకర్మల అభివృద్ధి, సంక్షేమానికి ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో విశ్వకర్మల వృత్తి నైపుణ్యాలు, సేవలు కీలకమని పేర్కొన్నారు. అనంతరం పలువురు విశ్వకర్మలను శాలువాలతో సత్కరించారు. ఆలయ నిర్వాహకులు, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్ శారద బ్రహ్మచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక రోజు

• ప్రజా పాలనలో పారదర్శకత, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన సెప్టెంబర్ 17 చారిత్రక రోజని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కార్మిక, గనులు, భూగర్భ శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మెదక్ కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రికి కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.



మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించగా, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలనలో పారదర్శకత, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర గుర్తించాలి: బీఎంఎస్



**కొల్చారం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద బీఎంఎస్ ఆధ్వర్యంలో జాతీయ కార్మిక దినోత్సవం, విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వడ్ల నర్సింలు, కార్యదర్శి కుల్లా నర్సింలు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో కార్మికులు, శ్రమజీవులు, చేతివృత్తిదారులు, విశ్వకర్మల పాత్ర కీలకమన్నారు. రహదారులు, భవనాలు, వంతెనలు, మౌలిక వసతుల నిర్మాణంలో కార్మికుల శ్రమ దాగి ఉందన్నారు. వారి సేవలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 17ను జాతీయ కార్మిక దినోత్సవంగా అధికారికంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్, సంజీవులు, దుర్గేష్, ఈశ్వర్ గౌడ్, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, రామ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌పై అసత్య ఆరోపణలు సహించేది లేదు!

ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలి: నిజాంపేట్ రైతులు





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 17(జనంసాక్షి):** నిజాంపేట్ తహసీల్దార్ కార్యాలయంపై కొందరు చేస్తున్న ఆరోపణలను బాచేపల్లి, నిజాంపేట్ గ్రామాలకు చెందిన రైతులు కడవత్ కిషన్, పోచయ్య ఖండించారు. ఆధారాలు లేకుండా అధికారులపై ఆరోపణలు చేసి ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నారని తెలిపారు. నిజంగా అవకతవకలు జరిగితే ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉద్యోగులపై నిరాధార ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని పేర్కొన్నారు. ఆరోపణలకు ఆధారాలు ఉంటే బయటపెట్టాలని, లేకుంటే అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని రైతులు స్పష్టం చేశారు.

## కల్హేర్‌లో ప్రజా పాలన దినోత్సవం







**కల్హేర్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్హేర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం వేడుకలు నిర్వహించారు. గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాలు ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. తెలంగాణ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులు అర్పించారు. సెప్టెంబర్ 17కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటం, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం విలువలను నేటితరానికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ప్రతి ఓటు ఎంతో ముఖ్యం.. బీఎల్ఏ-2లదే ప్రధాన భూమిక

• నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
• ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా పనిచేయాలి
• చిన్న తప్పిదాలను కూడా సరిచేయాలి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్ఏ-2ల బాధ్యత కీలకమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని ఆర్జీ గార్డెన్స్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మల్లేష్ యాదవ్, శత్రురావు శిక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్త కాపు శివసేనారెడ్డి, మాట్లాడుతూ.. బూత్ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత బీఎల్ఏ-2లపై ఉందన్నారు. ఓటరు నమోదు, వివరాల సవరణ సమయంలో చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో సరిచేయించాలని సూచించారు. వివరాల పరిశీలనకు సంబంధించి కొంతమంది ఓటర్లకు నోటీసులు అందుతున్న నేపథ్యంలో వాటిని నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన పత్రాలు, వివరాలను వెంటనే సమర్పించేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని బీఎల్ఏ-2లకు సూచించారు.



పనిచేయని చోట కొత్త బీఎల్ఏ-2లు

ప్రతి బూత్‌లో బీఎల్ఏ-2లు క్రియాశీలకంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సక్రమంగా పనిచేయని బీఎల్ఏ-2ల వివరాలను సేకరించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్తవారిని నియమించుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఓటర్ల వివరాల పరిశీలన, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల నమోదుకు సంబంధించిన అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించారు.

ఎన్నికల జాబితాలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా ప్రతి బూత్‌లో బీఎల్ఏ-2లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులు దృశ్య మాధ్యమం ద్వారా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలను బీఎల్ఏ-2లకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం



**పెంట్లవెల్లి మండల కేంద్రం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెంట్లవెల్లి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు శ్యామల దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు.

జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండీ ఖలీల్ పాషా, కొత్తపేట కురుమూర్తి అశోక్, సీనియర్ నాయకులు యల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూత.. ఆత్మవిశ్వాసానికి బాట

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మెదక్ కలెక్టరేట్ ఐడీఓసీలో దివ్యాంగులకు సహాయక పరికరాలను ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అవసరమైన సహకారం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతకుముందు మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలోనూ జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు ప్రజాపాలన



దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 17కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొంటూ ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలన మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా పాలనే ప్రజలకు చేరువ కావాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే నిజమైన ప్రజాపాలన అని రోహిత్ రావు అన్నారు. మెదక్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు.

ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమం అనంతరం మెదక్‌లో నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, టౌన్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న ఆంజనేయులు గౌడ్‌కు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పరామర్శ

**సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఇటీవల అనారోగ్యానికి గురైన మరెపల్లి ఆంజనేయులు గౌడ్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం పరామర్శించారు.



ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, మల్లగౌడ్, అంజిరెడ్డి, అరవిందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్యాంరావు, ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఇంజనీర్లే దేశ అభివృద్ధికి మూలస్తంభాలు

- 11 మంది ఇంజనీర్లకు ఘన సత్కారం



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఆవిష్కరణలకు రూపకల్పన చేసి అభివృద్ధికి బాటలు వేయడంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని లయన్ పి. రాములుగౌడ్, రీజియన్ చైర్మన్ జి.వెంకన్న అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. అధ్యక్షుడు ఎస్. విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంజనీర్ బి. దిలీప్‌కుమార్ ప్రోగ్రామ్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఇంజనీరింగ్ రంగంలోని వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న 11 మంది ఇంజనీర్లను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అట్యా పట్యా పోటీలకు హరీష్ ఎంపిక

**అచ్చంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** పట్టణంలోని ఎంఎస్ఎన్ పాఠశాలకు చెందిన సబ్‌జూనియర్ విద్యార్థి వి. హరీష్ అట్యా పట్యా క్రీడలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించడంతో ఈ అవకాశం దక్కింది. హరీష్ ఎంపికపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల చైర్మన్ సి.ఎం. రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని, క్రమశిక్షణ, పట్టుదల, సాధనతో హరీష్ జాతీయ స్థాయికి చేరడం గర్వకారణమన్నారు. జాతీయ పోటీల్లోనూ రాణించి పాఠశాల, తల్లిదండ్రులు, తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హరీష్ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, పీఈటీ ఉపాధ్యాయులు, కోచ్‌లను అభినందించారు.



## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి లక్ష్మారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



**మిడ్జిల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండలంలోని తాండాలలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి. చిత్రపటాలకు గిరిజనుల ఆధ్వర్యంలో పాలాభిషేకం లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు, మండల ఎస్టీ (ST) సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ పవార్ ఆధ్వర్యంలో చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతానికి పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని లక్ష్మణ్ పవార్ పేర్కొన్నారు.తండాల అభివృద్ధి: బీఆర్ఎస్ (BRS) ప్రభుత్వ హయాంలో 3,146 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని, దీనివల్ల సుమారు 30 వేల మంది గిరిజనులు ప్రజాప్రతినిధులుగా మారారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల సభలో గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మాట ఇచ్చి తప్పిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తండాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి, గ్రామ అధ్యక్షుడు రవి నాయక్, స్థానిక నాయకులు శంకర్, శాంతి కేళి, చంద్రు, బాల్యలతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు, గిరిజన మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహమే

- తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర ప్రభాకర్

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17ను విద్రోహ దినంగా పేర్కొంటూ తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర ప్రభాకర్ అన్నారు. గద్వాల అంబేద్కర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ నిజాం



పాలన, రజాకార్ల దౌర్జన్యాలు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం, కమ్యూనిస్టు ఉద్యమం పోరాడిందన్నారు. భూముల కోసం, వెట్టిచాకిరీ నిర్మూలన, పేద రైతుల హక్కుల కోసం పోరాటం జరిగిందని తెలిపారు. 1948 సెప్టెంబర్‌లో భారత సైన్యం హైదరాబాద్‌లోకి ప్రవేశించిన అనంతరం కూడా కమ్యూనిస్టు ఉద్యమంపై సైనిక, పోలీసు చర్యలు కొనసాగాయని పేర్కొన్నారు.

విలీనంతోపాటు అనంతర చరిత్రను కూడా ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రధానమంత్రి.జన్మదిన వేడుకలు

**బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ..**



**మహమ్మదాబాద్,సెప్టెంబర్17 (జనంసాక్షి):** భారత ప్రధానమంత్రి,నరేంద్ర మోడీ,జన్మదినాన్ని పురస్కరించుకుని, భారతీయ జనతా పార్టీ(బీజేపీ)ఆధ్వర్యంలో గురువారం మహమ్మదాబాద్ మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.బీజేపీ మండల అధ్యక్షుడు మూస నరసింహులు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న బీజేపీ నాయకులు..వైద్యులు సూచించిన విధంగా మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు.

అనంతరం వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని, పురస్కరించుకుని, దేశాయిపల్లి, ఎక్స్‌రోడ్ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ప్రధాని మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం ద్వారా ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తిని చాటుతున్నామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో, జిల్లా కౌన్సిల్ మెంబర్ కురవ కృష్ణ,ప్రధాన కార్యదర్శి కాశీనాథ్ మండల నాయకులు తిరుపతి రెడ్డి, వెంకట్ రెడ్డిపల్లి గ్రామ సర్పంచి, రామకృష్ణ,జయవర్ధన్ రెడ్డి, కృష్ణయ్య, రాహుల్,రాములు,భూత్ అధ్యక్షులు సతీష్ నాయక్,నరేష్, రామస్వామి,బిజెపి పార్టీ,కార్యకర్తలు యువకులు,ప్రజలు పాల్గొన్నారు.

# విలీన దినోత్సవంగానే జరపాలి

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అస్తవ్యస్తం: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబరు 17 (జనంసాక్షి):** సెప్టెంబరు 17ను విమోచన దినోత్సవంగా కాకుండా ముమ్మాటికీ విలీన దినోత్సవంగానే జరపాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా గురువారం వనపర్తిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిందని, ప్రజాస్వామ్యం, హక్కులు, జాతీయ సమైక్యత కోసం నాటి సాయుధ పోరాటంలో ఎందరో అమరులయ్యారని పేర్కొన్నారు. అందుకే సెప్టెంబరు 17ను జాతీయ సమైక్యత దినోత్సవంగా బీఆర్ఎస్ భావిస్తోందన్నారు.తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా దెబ్బతీసిందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్ కోతలు, సాగునీటి కొరత, యూరియా కొరత, సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులతో రాష్ట్రంలో





అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వంపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, వనం రాములు, దిలీప్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, వెంకటస్వామి, శివరామ్‌రెడ్డి, ఉంగ్లం తిరుమల్, చంద్రశేఖర్‌నాయక్, జాత్రు నాయక్, దేవర్ల నరసింహ, కౌన్సిలర్లు భారతి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, మురళీసాగర్, స్వాతి హరిబాబు, శిరీష రమేష్‌గౌడ్, పలుస శంకర్‌గౌడ్, గులాం ఖాదర్‌ఖాన్, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, మంద రాము, మహిళా నాయకులు నాగమ్మ, కవితా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులందరికీ ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి

- 'మీ ప్రమాణం' యాప్‌లో ప్రతి ఉద్యోగి హాజరు నమోదు చేసుకోవాలి
- శాఖాధిపతులు సిబ్బంది హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి 'మీ ప్రమాణం' ముఖ గుర్తింపు హాజరు యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో 'మీ ప్రమాణం' యాప్ నమోదు, హాజరు నమోదుపై అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అన్ని స్థాయిల్లో పనిచేస్తున్న సిబ్బంది 'మీ ప్రమాణం' యాప్ ద్వారా తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు యాప్‌లో నమోదు కాని శాఖలు వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించారు.

హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖాధిపతులు సిబ్బంది హాజరు వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఈడీఎం సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచానికి పనిముట్లు అందించిన ఘనత విశ్వకర్మలదే

- చేతివృత్తులను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాలి



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రపంచానికి పనిముట్లు తయారు చేసి అందించిన ఘనత విశ్వకర్మలదేనని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా మెదక్ రామాదాసు చౌరస్తా లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ చేతివృత్తులను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాలని సూచించారు. విశ్వకర్మల వృత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విశ్వకర్మలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాల్మీకి యువసేన పట్టణ అధ్యక్షుడిగా అంజన్ కుమార్



**మహబూబ్‌నగర్, రూరల్ సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ వాల్మీకి సంఘం యువసేన మహబూబ్‌నగర్ పట్టణ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పట్టణ అధ్యక్షుడిగా బి.అంజన్ కుమార్ ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా బి.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా బి.సందీప్, సహాయ కార్యదర్శిగా ఎస్.కళ్యాణ్, కోశాధికారిగా వి.హరి కుమార్ ఎన్నికయ్యారు. అంజన్ కుమార్‌కు నియామక పత్రం అందజేసి సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు కుర్మయ్య, కార్య దర్శి ఎర్ర నరసింహులు, జిల్లా అధ్యక్షుడు పొనకల్ కృష్ణయ్య, కోశాధికారి కోస్గి సతీష్, యువసేన అధ్యక్షుడు కావలి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే తొలి ప్రాధాన్యత

- అభివృద్ధిలో మెదక్‌ను ముందంజలో నిలిపేందుకు ప్రత్యేక చర్యలు





**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వ హించిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్క రించి పోలీసుల గౌరవ వందనం స్వీకరిం చారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని, తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులు, అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళు లర్పించారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే సంక్షేమ హామీల అమలుకు శ్రీకారం చుట్టిం దని మంత్రి తెలిపారు. మహిళలు, రైతులు, పేదలు, విద్యార్థులు, కార్మికులు, యువత సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల కు 4.73 కోట్ల ఉచిత ప్రయాణాలు, గృహ జ్యోతి కింద 1,29,756 మంది వినియోగ దారులకు జీరో విద్యుత్ బిల్లులు అందించి నట్లు తెలిపారు. రైతుభరోసా కింద వానా కాలం 2026లో 2,66,674 మంది రైతుల కు రూ.222.69 కోట్ల సాయం జమ చేశా మన్నారు. యాసంగి 2025-26లో 4,25, 305 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.1,116.06 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా 40,351 మంది కి వైద్య సేవలు అందించామన్నారు.

రామాయంపేటలో 20 ఎకరాల్లో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కింద 9,682 ఇళ్లు మంజూరు కాగా, 6,483 మంది లబ్ధిదారులకు రూ.177.08 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు.

ఉపాధిహామీ కింద 1,086 పనులకు రూ.98.51 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రహదారులు, సాగు, తాగునీరు, పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధి కొనసాగుతోందన్నారు. మెదక్‌ను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రజ లు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాస రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాలు



**పాపన్నపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించా లని ఐసిడిఎస్ సిడిపిఓ వెంకటరమణమ్మ పేర్కొన్నారు. గురు వారం ఎల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం వేడు కల్లో పాల్గొని ఆమె మాట్లాడారు. మూడు నుండి ఐదు సంవత్స రాలలోపు చిన్నారులకు, బాలింతలు, గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాలు అందించడం జరుగుతుందన్నారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే రక్తహీనత, పౌష్టికాహార లోపాలను నివారించవచ్చన్నారు. సూపర్ వైజర్లు శశికళ,రమ,అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు .

## బస్సులో ప్రయాణిస్తూ
# గుండెపోటుతో మహిళ మృతి



**చేర్యాల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన విషాద ఘటన గురువారం చేర్యాల శివారులోని గుర్జకుంట క్రాస్ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం చుంచన కోటకు చెందిన బింగి మల్లవ్వ (55) అనారోగ్యంతో చికిత్స కోసం చేర్యాల నుంచి సిద్దిపేట వెళ్తున్న బస్సులో ప్రయాణించారు. గుర్జకుంట సర్కిల్ వద్ద ఒక్కసారిగా సీటులో వాలిపోవడంతో డ్రైవర్, కండక్టర్ వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. మర్రిముచ్చాల సమీపంలో బస్సు వద్దకు చేరుకున్న 108 సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## పాంచ జన్య సభకు తరలిరావాలి



**మద్దూరు, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఈ నెల 20న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కొస్గిలో నిర్వ హించనున్న పాంచ జన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర నాయకులు, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గంగొళ్ల రంజిత్ కుమార్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు, నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గవినొళ్ల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.

సభకు పార్టీ అధ్యక్షురాలు కవిత అక్క ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణను వివరిస్తారని తెలిపారు. ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగ--ఉపాధి, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే సభ లక్ష్యమన్నారు. జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కార్యక్రమంలో బుచ్చిబాబు, పల్లెబండ నర్సిములు, దామరగిద్ద మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ కందేనపల్లి జి. శ్రీనివాస్ గౌడ్, మొగలమడక అనిల్ కుమార్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# చేతివృత్తిదారుల అభివృద్ధికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ఎంతో కీలకం

- బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి
- శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహణ



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా కార్యాలయంలో శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, సృష్టి, నిర్మాణం, శిల్పకళకు ప్రతీకగా శ్రీ భగవాన్ విశ్వకర్మను భారతీయ సంప్రదాయంలో గౌరవిస్తారని తెలిపారు. దేశ నిర్మాణంలో చేతివృత్తిదారులు, సంప్రదాయ కళాకారులు, శ్రమజీవుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ చేతివృత్తిదారులు, కళాకారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను అమలు చేస్తోందని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన సంప్రదాయ వృత్తిదారులకు నైపుణ్య శిక్షణ, ఆధునిక పనిముట్లు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ తదితర అంశాల్లో సహకారం అందించేలా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, సబి రెడ్డి, వెంకట్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న, మెంటం పల్లి పురుషోత్తం రెడ్డి, రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుజ్ఞా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, వారణాసి కల్పన, జిల్లా ఉపాధ్యక్షులు భాషెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి శివారెడ్డి,సరోజ మాజీ పార్లమెంట్ కో-కన్వీనర్ దాసరాజుల ప్రవీణ్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తిని మధుసూదన్, పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి సూగురు రాములు, సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, గోపాల్,సుమిత్రమ్మ,కొండోజ్ గోపీనాథ్ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు అరవింద్, మహిళా మోర్చా అధ్యక్షులు కవిత వెంకటేష్ నాయక్, నవీన్, చిన్న రాయుడు, రఘు,నవీన్ సాగర్,ఉందే కోటి, వెంకటేష్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి కృత్రిమ కుంటలను వినియోగించాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



జడ్చర్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): గణేష్ నిమజ్జనం కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా సమీపంలోని కృత్రిమ బేబీ కుంటలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం సూచించారు. చిన్న, మధ్య తరహా విగ్రహాలను ఈ కుంటల్లోనే నిమజ్జనం చేయాలని కోరారు. జిల్లాలో వేడుకలను శాంతియుతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని, నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు ఎండిపోవడంతో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద, బీసీ హాస్టల్ వెనుక ఉన్న 3వ వార్డు పార్కులో, 8వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కేంద్రాల వద్దే నిమజ్జనం పూర్తి చేసి యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మిడ్ పరీక్షల విధుల బహిష్కరణ

- 18 నుంచి టీపీ-జాక్ సహాయ నిరాకరణ
- వినతి పత్రం అందజేసిన టిపి జాక్



వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 17 (జనంసాక్షి): తెలంగాణ పాలిటెక్నిక్ అధ్యాపకుల సంయుక్త కార్యాచరణ కమిటీ (టీపీ-జాక్) ఆధ్వర్యంలో వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఆందోళనను ఉధృతం చేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే మధ్యంతర పరీక్షల విధుల్లో పాల్గొనబోమని ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర టీపీ-జాక్ జారీ చేసిన లేఖను కళాశాల ప్రధానాచార్యుడికి అధ్యాపకులు అందజేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర చర్చలు జరగలేదని టీపీ-జాక్ పేర్కొంది. కమిటీ గడువు ముగియడానికి మరో ఎనిమిది రోజులు మాత్రమే ఉన్నప్పటికీ, తిరిగి చర్చలకు ఆహ్వానం అందలేదని తెలిపింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌ను సంప్రదించినప్పటికీ, సమస్యలపై అర్థవంతమైన చర్చకు అవకాశం లభించలేదని పేర్కొంది. ప్రభుత్వంతో ఘర్షణకు దిగడం, విద్యార్థులకు ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని టీపీ-జాక్ స్పష్టం చేసింది. ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి, పాలిటెక్నిక్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని లేఖలో కోరింది.

## ప్రధానికి అండగా నిలుద్దాం: ఎన్వీ సుభాష్




నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): ప్రధాని నరేంద్ర మోదీకి అండగా నిలిచి భారత్‌ను విశ్వగురుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్.వి. సుభాష్ కోరారు. నారాయణపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ దేశాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం రూ.18 వేల కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, రతంగ్ పాండురెడ్డి, సత్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అలంపూర్‌కు కేంద్రం నిధులు




గద్వాల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ మాట్లాడారు. అలంపూర్ జోగులాంబ ఆలయ సమగ్ర పర్యాటక అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద కేంద్రం రూ.37 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. గద్వాల చేనేత కళాకారులకు ముద్ర రుణాలు, నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ రహదారుల విస్తరణ, గ్రామీణ సడక్ యోజన కింద రహదారుల అనుసంధానానికి నిధులు కేటాయించిందన్నారు. ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా పేదలు, రైతులకు లబ్ధి చేకూరుతోందని చెప్పారు. రైల్వేలు, మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని నిధులు రానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీకే స్నిగ్ధారెడ్డి, రామాంజనేయులు, రామచంద్రారెడ్డి, బండల వెంకట రాములు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

- సెప్టెంబర్ 17 చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలి





గోపాలపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని గోపాలపేట జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు జిల్లెల సురేందర్‌రెడ్డి అన్నారు. గత తరాల త్యాగాలు, ఉద్యమాల స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు చరిత్రను కేవలం పాఠ్యాంశంగా కాకుండా ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక బాధ్యతలను నేర్పే మార్గదర్శకంగా భావించాలని సూచించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేలా విద్యార్థులు ముందుకు సాగాలని, క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 17 సందర్భంగా పాఠశాలలో చారిత్రక అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువులో ఈతకు వెళ్లి బాలుడు మృతి



మిడ్జిల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో గురువారం విషాదం చోటుచేసుకుంది. స్థానిక చెరువులో ఈతకు వెళ్లిన సాయి తేజ అనే బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కావాలి కళావతి, లక్ష్మయ్య దంపతుల ఇద్దరు కుమారులు కలిసి మధ్యాహ్నం చెరువుకు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో చిన్న కుమారుడు సాయి తేజ నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాసులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## త్యాగాల స్ఫూర్తితో సమైక్యతను కాపాడుకుందాం

- జాతీయ సమైక్యతా దినోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి



మెదక్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ దేశ సమైక్యతను బలోపేతం చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మెదక్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి తెలంగాణ అడుగుపెట్టిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవాలన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటాలు, యోధుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. సమైక్యత అంటే సరిహద్దులు కలవడం మాత్రమే కాదని, ప్రజల మనసులు కలవడమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు గిరిజనుల కృతజ్ఞతాభినందనలు

- ప్రతి తండాలో చిత్రపటానికి పాలాభిషేకం



జడ్చర్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం జడ్చర్ల మండలంలోని ప్రతి తండాలో గిరిజనులు, బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి ధన్యవాదాలు తెలిపారు. దేవునిగుట్ట తండాలో ఉప సర్పంచ్ వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని గిరిజనులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మీశంకర్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, మాజీ మూడ డైరెక్టర్ ఇంతియాజ్ ఖాన్, కరాటే శ్రీను, సురేష్, సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, గిరిజన నాయకులు లక్ష్మణ్ నాయక్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



మక్తల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): మక్తల్ పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తాలో వివేకానంద విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ వారోత్సవాలలో భాగంగా, గురువారం నాల్గవ రోజు ఏబీవీపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ వ్యవస్థాపక కమిటీ, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా స్వామి వివేకానంద చౌరస్తాలో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం దేశభక్తి చాటే విధంగా భారీ తిరంగా ర్యాలీని నిర్వహించారు. భారత్ మాతా కీ జై నినాదాలతో పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విగ్రహ వ్యవస్థాపక కమిటీ సభ్యులు, వివిధ రంగాల ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చెరువుల్లోనే మత్స్యకారులకు చేపలు పట్టే హక్కులు

- ప్రైవేటు కుంటల్లో చేపలు ఎలా పడతారు?: బీఆర్ఎస్ నేత బాలస్వామి



బిజినేపల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): ప్రభుత్వ శిఖం, భూములు కలిగిన చెరువులు, కుంటల్లోనే మత్స్యకారులకు చేపలు పట్టుకునే హక్కులు ఉంటాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాలస్వామి అన్నారు. ప్రైవేటు భూముల్లో తవ్వుకున్న కుంటల్లో మత్స్యకారులకు ఎలాంటి అనుమతులు ఉండవని తెలిపారు.

మంగనూరు గ్రామంలో కొంతకాలంగా మత్స్యకారులు, ప్రైవేటు భూ యజమానుల మధ్య జరుగుతున్న వివాదంపై గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారులు తమ వృత్తిని ప్రభుత్వ చెరువుల్లో కొనసాగిస్తే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసిన 16 ఎకరాల పట్టా భూమిలో తవ్వుకున్న కుంటలో తమకు హక్కు ఉందంటూ రావడం సరికాదన్నారు. ఆ భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు మత్స్యకారులను తప్పుదోవ పట్టిస్తూ రెచ్చగొడుతున్నారని బాలస్వామి ఆరోపించారు. ఎస్సీ, బీసీల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. మత్స్యకారులు వాస్తవాలను తెలుసుకుని లేనిపోని మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ సమావేశంలో మంగనూరు ఉపసర్పంచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ విమోచన

## పోరాట చరిత్రను భావితరాలకు చాటి చెప్పాలి

• మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** బీజేపీ వనపర్తి జిల్లా కార్యాలయంలో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బీజేపీ సీనియర్ నాయకులు బండారు కుమార్ స్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందన్నారు. ప్రజల స్వేచ్ఛ, భారత యూనియన్‌లో విలీనంకోసం సాగిన ఉద్యమానికి ముగింపుగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం విలీనమైందని తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆధ్వర్యంలో ఆపరేషన్ పోలో అనంతరం నిజాం పాలనకు ముగింపు పలికిందన్నారు. తెలంగాణ ప్రజల పోరాటం, అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ రోజును 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి, సబి రెడ్డి, కేతూరి బుద్ధన్న, పురుషోత్తం రెడ్డి, పెద్దిరాజు, భాషెట్టి శ్రీనివాసులు, బత్తిని మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# విధిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

• రిజర్వేషన్లు, రోస్టర్ విధానం పక్కాగా అమలు చేయాలి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీల సామాజిక, న్యాయపరమైన సమస్యలను జిల్లా స్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ఎస్సీ, ఎస్టీల విద్య, సంక్షేమం, ఉపాధి అవకాశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు.

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎస్సీ, ఎస్టీ సమస్యలు, భూమి, సర్వీస్, అట్రాసిటీ కేసులపై చర్చించారు. ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే సివిల్ రైట్స్ డే సమావేశాలకు పోలీస్, రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా హాజరై సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, రోస్టర్ విధానం, రిజర్వేషన్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధులను ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమానికే వినియోగించాలని, దారి మళ్లకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసులను కోరారు.

ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు గౌరవంగా మాట్లాడి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని సరైన మార్గనిర్దేశం చేయాలని అన్నారు. దరఖాస్తులను సానుకూలంగా పరిశీలించి సాధ్యమైనంత వరకు జిల్లా స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ కమిషన్ సూచనల మేరకు ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు, వసతులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, నిధుల వినియోగంపై ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపడతామన్నారు. జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు అంబేద్కర్ కళాభవన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో కమిషన్ సభ్యులు కే. లక్ష్మీనారాయణ, నేనావత్ రాంబాబు నాయక్, అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన రూట్‌ను పరిశీలించిన ఎస్పీ

• పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం

**మక్తల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం మక్తల్ పట్టణంలో నిమజ్జన శోభాయాత్ర ప్రధాన రూట్‌ను ఆయన పరిశీలించారు. ఆజాద్‌నగర్, షరీఫా మజీద్ చౌరస్తా, కర్నె రోడ్డు, యాదవ్‌నగర్, వాకిటి గేరి, జామియా మజీద్, నేతాజీనగర్, రజకవాడ, భవానీనగర్, నల్లజనమ్మ టెంపుల్ మీదుగా మినీ ట్యాంక్‌బండ్ వరకు మార్గాన్ని పరిశీలించారు.

నిమజ్జన మార్గంలోని మసీదులు, దేవాలయాలు, ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక భద్రత కల్పించాలని, సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.



శోభాయాత్రలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిసర గ్రామాలు, మండలాల నుంచి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు.

నిమజ్జన ప్రదేశంలో లైటింగ్, పారిశుద్ధ్యం, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, క్రేన్లు, గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని మున్సిపల్, పోలీసు అధికారులకు సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, చిన్నారులు, వృద్ధులు నీటి సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈత రాని వారు చెరువులోకి దిగరాదని భక్తులకు సూచించారు.

మక్తల్ పట్టణంలోని గణేష్ మండపాలను కూడా ఎస్పీ పరిశీలించి, నిర్వాహకులు అనుమతులు, భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. విద్యుత్ తీగలు, జనరేటర్లు, ఇతర పరికరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఉమ్మమహేశ్వర ఆలయంలో మట్టి గణపతిని, యాదవ్‌నగర్‌లోని గణేష్ విగ్రహాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, మతపెద్దలు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల పైన దృష్టి సారించాలి



**బిజినాపల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు తక్కువగా ఉన్నాయని దీంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆ సమయంలో ప్రత్యామ్నాయ పంటల పైన రైతులు దృష్టి సారించాలని రావే విద్యార్థులు సూచించారు గురువారం మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో రావేపు విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు చేశారు చిరుధాన్యాల పంటల పైన దృష్టి పెట్టాలని అదేవిధంగా సోలార్ యూనిట్ కోళ్ల పెంపకం మేకల పెంపకం వంటి పనుల పైన కూడా దృష్టి సారించడం ద్వారా లాభాలు సాధించవచ్చునని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందిరా వెంకట రాములు గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పవిత్ర మాజీ సర్పంచ్ కావలి వెంకటయ్య వార్డు మెంబర్ శ్రీకాంత్ రావేపు విద్యార్థులు అఖిల ఆసియా భవాని పుష్పలత సౌజన్య విజయలక్ష్మి పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యాలు, శిల్పకళలకు విశ్వకర్మ భగవానుడు ఆదర్శం

• మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని వనపర్తి పట్టణంలోని బ్రహ్మంగారి దేవాలయంలో స్వర్ణకార సంఘం, దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ మహాయజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల మధ్య జరిగిన కార్యక్రమానికి భక్తులు, స్వర్ణకార సంఘం ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ వర్గాల ప్రజలు హాజరయ్యారు.

కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాయజ్ఞంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం భక్తులు, నిర్వాహకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. శిల్పకళ, నిర్మాణ నైపుణ్యం, వృత్తి నైపుణ్యాలు, సృజనాత్మకతకు ఆయన ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. తరతరాలుగా వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న నైపుణ్య కార్మికులు సమాజ అభివృద్ధికి ఎంతో సేవ చేస్తున్నారని తెలిపారు.

విశ్వకర్మ జయంతి సందర్భంగా సంప్రదాయ వృత్తులు, కళలను ప్రోత్సహించడంతో పాటు కళాకారులు, శ్రామికులు, నైపుణ్య కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతికతను సంప్రదాయ వృత్తులతో అనుసంధానిస్తే యువతకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం స్వర్ణకార సంఘం ప్రతినిధులు మాజీ మంత్రిని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. పలువురు స్వర్ణకారులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మోహనచారీ, బులియన్ మర్చంట్ అధ్యక్షుడు బంగారు అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ ఆచారి, నవీన్ ఆచారి, ప్రసాద్, అనిల్, జాయిని మధు తదితరులు పాల్గొన్నారు.



### మోదీ సేవా కార్యక్రమాల

# స్ఫూర్తితో రక్తదాన శిబిరం



**మక్తల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా మంతన్ గౌడ్ గ్రామంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని తెలిపారు. యువత సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మోదీ సంకల్ప యాత్ర కన్వీనర్ బలరాం రెడ్డి, కో-కన్వీనర్ విమలాభాయ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, రూరల్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, బల్ రెడ్డి, స్వాగత్ సత్తి, అడెం సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లిలో 325 సర్వే నంబర్ భూముల సర్వే

- **అధికారులను అడ్డుకున్న దళిత రైతులు.. వాగ్వాదంతో ఉద్రిక్తత**



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఎర్రవల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నంబర్ భూముల్లో గురువారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి సంబంధించిన భూములపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వే ప్రారంభమైంది. సుమారు 388 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉందన్న అంశంపై భూముల హద్దులు, రికార్డులు, ఆధీనంలో ఉన్నవారి వివరాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు.

గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, మర్కుక్ తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో అధికారులు సర్వే ప్రారంభించగా, గ్రామానికి చెందిన దళిత రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు ముందస్తు సమాచారం



ఇవ్వకుండా భూములు ఎలా కొలుస్తారని ప్రశ్నించడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై తమ జీవనోపాధి ఆధారపడి ఉందని రైతులు తెలిపారు. సర్వే పేరుతో భూములు స్వాధీనం చేసుకుంటారనే భయంతో ఉన్నామని, నిర్ణయం తీసుకునే ముందు తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టామని, భూముల వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడమే సర్వే ఉద్దేశమని వివరించి నట్లు తెలిసింది. సర్వేతో వెంటనే ఎవరి భూమినీ స్వాధీనం చేసుకునే నిర్ణయం లేదని స్పష్టం చేశారు.

325 సర్వే నంబర్‌లో సుమారు 150 దళిత కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేస్తున్నా యని రైతులు పేర్కొన్నారు. తమ భూములకు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌తో సంబంధం లేదని, కొంతమంది రైతులు పట్టా భూములను స్వచ్ఛందంగా విక్రయించారని తెలిపారు. అయితే భూముల హక్కులు, విస్తీర్ణం, హద్దులు, అసైన్డ్ భూముల వివరాలపై అధికారిక రికార్డులు, సర్వే అనంతరమే స్పష్టత రానుంది.

భూములపై విచారణను 30 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్వే అనంతరం క్షేత్రస్థాయి వివరాలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నారు.

# పాఠశాలలో బిర్యానీ కలకలం..



పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులకు బిర్యానీతో పాటు అక్షయపాత్ర భోజనం కూడా వడ్డించారు. గురువారం అక్షయ పాత్ర భోజనం కూడా బగారా రైస్ ఉండడంతో భోజనం చేసిన కొదిసేపటికే పలువురు విద్యార్థులు వాంతులు, కడుపునొప్పి, అస్వస్థత వంటి లక్షణాలతో ఇబ్బందులకు గురయ్యారు. విద్యార్థులు అస్వస్థత కారణం బిరియానా, అక్షయ పాత్ర భోజనమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల అస్వస్థతను గమనించిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అప్రమత్తమై వారిని వెంటనే సదాశివపేట , సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన 31 మంది విద్యార్థుల్లో 21 మందికి సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రిలో, మరో 10 మందికి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రులకు చేరుకుని తమ పిల్లల పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారులు పరామర్శించి వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.





బిర్యానీ తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారా? ఆహారం కలుషితమైందా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంగారెడ్డి, సదాశివపేట ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను మునిపల్లి ఎంపీడీవో, తహసిల్దార్, ఎంఈఓ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, సిపిఎం నాయకులు జయరాజ్, రమేష్ గౌడ్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరామర్శించారు.

# ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాలు, సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రోస్టర్, రిజర్వేషన్ల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వర పరిష్కారం చూపాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

సబ్‌ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలని సూచించారు. రోస్టర్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. బ్యాక్‌లాగ్ ఖాళీలను గుర్తించి నియామకాలు చేపట్టాలని, అంగన్‌వాడీ భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

సివిల్ రైట్స్ డే సమావేశాలకు తహశీల్దార్లు, సంబంధిత ఎస్ఐలు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణ, సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, అంతర్‌కుల వివాహ ప్రోత్సాహకం, భూమి కొనుగోలు పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

పేద ఎస్సీల భూములకు బోర్‌వెల్స్, పంపుసెట్లు, విద్యుత్ సదుపాయాల కోసం ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో శాఖల వారీగా సంక్షేమ పథకాల పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 22 అట్రాసిటీ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం పిటిషనర్ల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జె.ఎల్.బి. హరిప్రియ, అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయాలి

- **జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రజల రక్షణ, వారి సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..** పోలీసులు ప్రతిరోజును సేవా దినంగా భావించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. బాధితుల సమస్యలను సానుభూతితో విని, చట్టపరంగా పరిష్కరించాలని, విధుల్లో నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ పాటించాలని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా పోలీసు శాఖ పనిచేయాలని సూచించారు.

అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరా రెడ్డి,వనపర్తి డీఎస్పీ గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ సునంద, వనపర్తి సీఐ, సుగంధ రత్నం కొత్తకోట సీఐ, ఓడి, రమేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేతి వృత్తిదారులకు ప్రతీకగా భగవాన్ విశ్వకర్మ



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** శిల్పులు, చేతివృత్తిదారులు, కార్మికులకు భగవాన్ విశ్వకర్మ ప్రతీకగా నిలుస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఐడీఓసీ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతతో సమాజ అభివృద్ధికి సేవలందిస్తున్న చేతివృత్తిదారుల సేవలు విలువైనవన్నారు. వడ్రంగులు, కమ్మర్లు, స్వర్ణకారులు, చేనేత, కుమ్మరి, శిల్పులు తదితర సంప్రదాయ వృత్తులు సాంస్కృతిక వారసత్వంలో భాగమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, సరిత, గట్టు తిమ్మప్ప, అధికారులు, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నారాయణపేట కలెక్టరేట్‌లో మంత్రి వాకిటి శ్రీహరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. నారాయణపేట జిల్లాలో రైతు భరోసా కింద 1,82,031 మంది రైతుల ఖాతాల్లో రూ.259 కోట్లు జమ చేసినట్లు, రైతు బీమా కింద 618 మంది రైతుల కుటుంబాలకు రూ.30.90 కోట్లు అందించినట్లు పేర్కొన్నారు. రబీ 2025-26లో 163 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.366 కోట్లతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 30,247 మందికి రూ.87.11 కోట్ల వైద్య సేవలు అందించామని, 70,120 మంది లబ్ధిదారులకు సబ్సిడీపై 1,83,969 గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పారు. గృహజ్యోతి కింద 83,032 కుటుంబాలు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందుతున్నాయని తెలిపారు. భూములు కోల్పోయిన 3,112 మంది రైతులకు రూ.366.95 కోట్ల పరిహారం అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వకర్మ చేతివృత్తులకు ఆద్యుడు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** విశ్వకర్మ చేతివృత్తులు, కళలు, నైపుణ్యాలకు ఆద్యుడని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. చేతివృత్తిదారుల నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు, శిక్షణ, ఉపాధి అవకాశాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో సంగారెడ్డి మెడికల్ కళాశాలను అగ్రస్థానంలో నిలుపుతాం

- **చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం: మంత్రి దామోదర్ రాజనర్సింహ**



సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): రాబోయే రెండేళ్లలో సంగారెడ్డి మెడికల్ కళాశాలను వైద్య విద్య, వైద్య సేవలు, మౌలిక వసతుల పరంగా దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా అభివృద్ధి చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం హెటిరో ఫౌండేషన్ సౌజన్యంతో రూ.1.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్, క్రికెట్, కబడ్డీ కోర్టులు, ఓపెన్ క్రికెట్ గ్రౌండ్‌ను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పారితోష్ పంకజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు.

విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. వైద్య విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. వైద్య రంగాన్ని బలోపేతం



చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన సదుపాయాలతో ఆసుపత్రుల నిర్మాణం చేపడుతున్నామని, సుమారు రూ.500 కోట్లతో ఆధునిక ఆసుపత్రుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వైద్యులుగా ఎదిగిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తూ సమాజం పట్ల బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.

ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు మంత్రి పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 700 మంది రోగులకు నెలకు ఒక కిట్ చొప్పున ఆరు నెలల పాటు కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. క్షయ నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు, ఇతర సంస్థల సహకారం అవసరమన్నారు.





కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య, అదనపు కలెక్టర్ పాండు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశరావు, ఆర్డీఓ రాజేందర్, హెటిరో ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ జయంతి, తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



మద్దూర్ లో



జడ్చర్లలో



రాజోళి లో



కొత్తపల్లి లో



శ్రీరంగాపూర్ లో



మల్దకల్ లో



నవాబుపేట్ లో



నారాయణపేట లో



వనపర్తి లో



రేవల్లి లో



బాలానగర్ లో



మల్దకల్ లో



పెంట్లవెల్లి లో



మహబూబ్ నగర్ లో



కృష్ణ లో



శ్రీరంగాపూర్ లో



ఖిల్లా ఘనపురం లో

# విశ్వకర్మ జయంతి, తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



**రామాయంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, బీజేపీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి నవీన్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయ్ భాస్కర్ రెడ్డి,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి గట్టగారి శ్రీకాంత్, గ్రామ పెద్దలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



**చేర్యాల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళా శాలలో గురువారం తెలంగాణ విలీన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారి గురువారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



**చేర్యాల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ రైతంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్క రించుకొని బుధవారం చేర్యాల మండల వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎస్ఆర్ఓ, పలు ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రధానోపాధ్యాయులు, గ్రామ పంచాయతీల వద్ద సర్పంచ్‌లు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో కార్యాలయాల ముందు అధ్య క్షులు జాతీయ జెండాను ఎగురవేసి ప్రజాపాలన వేడుకలు నిర్వహించారు.



**తూప్రాన్, సెప్టెంబర్ 17(జనంసాక్షి):** విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలు తూప్రాన్ పట్టణంలో గురువారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ శోభాయాత్ర పట్టణంలో భక్తి పారవశ్యాన్ని నింపింది. విశ్వకర్మ భగవానుడికి జై అంటూ మార్మోగిన నినాదాలు, భక్తుల ఉత్సాహం, సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్ రామునిగారి నాగరాజు గౌడ్, మాజీ కౌన్సిలర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేష్, జిన్నా భగవాన్ రెడ్డి, తాటి లచ్చుల్, తుమ్మల మల్లేష్, సామల అశోక్, కుమ్మరి రఘుపతి, తాటి లెక్చర్, సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ సిఆర్ జానకిరామ్, సిఆర్ పూర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



**కొల్చారం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని స్థానిక కాళికాదేవి ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ జయంతిని గురువారం నాడు పురస్కరించుకొని విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో విశ్వకర్మ జెండా ఆవిష్కరించడం జరిగింది కార్యక్రమంలో పాల్గొన్నవారు మండల అధ్యక్షుడు వడ్ల ప్రభాకర్ చారి గ్రామ అధ్యక్షులు దుర్గపతి చారి పాండు రంగాచారి సిద్దయ్య చారి నరసింహ చారి వీరస్వామి చారి శ్రీనివాస్ చారి శివకుమార్ చారి కరుణాకరాచారి శ్రవణ్ చారి విశ్వేశ్వర్ చారి మహిళా మణులు పాల్గొన్నారు.



**కొల్చారం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** భారతదేశానికి 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం లభించినప్పటికీ హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన కొనసాగిందని కొల్చారం తహసీల్దార్ శ్రీనివాస్ చారి తెలిపారు. ప్రజల ఉద్యమాలు, పోరాటాల ఫలితంగానే 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమై తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్, ఆర్ ఐ, తదితరులు పాల్గొన్నారు.



**తూప్రాన్, సెప్టెంబర్ 17(జనంసాక్షి):** విశ్వకర్మ జయంతి సందర్భంగా తూప్రాన్‌లోని బ్రహ్మంగారి గుడిలో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు కమ్మరి శ్రీధర్ చారి, మేడోజి రామచంద్రం చారి, కమ్మరి రాజు చారి, కమ్మరి రాఘవ చారి, కమ్మరి రాజశేఖర్ చారి, కమ్మరి వినయ్ కుమార్ చారి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు జి. అంజయ్య, కార్యదర్శి ఎం. మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**శివ్వంపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రమైన శివ్వంపేట్ లో విశ్వకర్మ జయంతి వేడుకలను స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ప్రభాకర్ చారి, కోశాధికారి సంపత్ కుమార్ చారి, రాకేష్ చారి, సభ్యులు రవి చారి, శ్రీకాంత్ చారి, నారాయణ చారి, సాయి కృష్ణచారి ( కిట్టు), సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు. ఘనంగా నిర్వహించారు.



**పాపన్నపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండల కేంద్రంలో గురువారం సృష్టికర్త విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పతాకవిష్కరణ చేశారు. విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు వడ్ల కుబేరుడు,సంతోష్ చారీ,ప్రభుభూషణ్, అశోక్, భాగేష్,సాయిలు,రఘు,దత్తు,లక్ష్మణ్ చారీ,శ్రీను, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.



**కోహిర్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



**పాపన్నపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** మండలం వ్యాప్తంగా గురువారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్వో కార్యాలయం వద్ద తహశీల్దార్ సతీష్ కుమార్,మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈఓ ప్రతాపరెడ్డి, పాపన్నపేట, కుర్తివాడ, ఎల్లాపూర్, సీతానగర్ గ్రామపంచాయతీల ప్రాంగణంలో సర్పంచులు పావని గౌడ్,శ్రీధర్,శేఖర్,రాణేమ్మ జాతీయ జెండాను ఎగురావేశారు. ఎంపీడీఓ విష్ణువర్ధన్,ఆర్ఐ శరత్ తదితరులు పాల్గొన్నారు.



**కొల్చారం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో గురువారం వేడుకలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఉప సర్పంచ్ రవీందర్, వార్డు సభ్యులు సుధాకర్, మమత, శ్రీనివాస్, సిద్ధు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



**ఉర్కొండ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి);** నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తాహసిల్దార్ యూసుఫ్ అలీ, ఎంపీడీవో కార్యాలయంలో సత్యపాల్ రెడ్డి మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఆయా గ్రామాల సర్పంచులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



**నారాయణపేట, సెప్టెంబర్ 17(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం బిజెపి, ఎబివిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, ఎబివిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



**గద్వాల,సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



**చిన్నంబావి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** చిన్నంబావి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి అనుకలి సంపత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను గుర్తు చేసుకున్నారు.



**మిడ్జిల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాని ఎగురవేసి తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.